కాంగ్రెస్ పార్టీకే గ్యారంటీ లేదు

గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

- అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరికలు
- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్, నవంబర్ 3 : గ్యారంటీ స్కీమ్‌లు అంటూ ప్రజల్లోకి వస్తున్న గ్యారంటీ లేని పార్టీ కాంగ్రెస్ అని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి విమర్శించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన సమక్షంలో మేళ్లచెరువు మండలం రాఘవపురానికి చెందిన 25 కాంగ్రెస్ కుటుంబాల వారు, గరిడేపల్లి మండలం రేగులగడ్డ తండాకు చెందిన 30కుటుంబాల వారు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ కర్ణాటకలో ఎమ్మెల్యేల కుమ్ములాటలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. కర్ణాటకను కాపాడుకోలేని వారు తెలంగాణ రాష్ట్రంలో పెత్తనం చెలాయిస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉందన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోకు అత్యంత ప్రజాదరణ వస్తున్నదన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని 4వేల కోట్లతో అభివృద్ధి చేశామని, దాన్ని చూసి బీఆర్ఎస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నగేశ్ రాథోడ్, శ్రీహరి, అలీ పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

హుజూర్‌నగర్ : పట్టణంలోని రెండో వార్డులో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన షేక్ కుర్బిద్, అనారోగ్యంతో మృతిచెందిన వల్లపుదాసు భిక్షం కుటుంబాలను ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి శుక్రవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జక్కుల శంభయ్య, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు ఎండీ.షఫీ, అబ్బుల్ నబీ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక నాయకుడు ఉపేందర్

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- బీఆర్ఎస్‌కేవీ నియోజకవర్గ అధ్యక్షుడు ఉపేందర్

హుజూర్‌నగర్ రూరల్, నవంబర్ 3 : కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నదని బీఆర్ఎస్‌కేవీ నియోజకవర్గ అధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఆటో యూనియన్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం బీమా అందిస్తున్నదన్నారు. ఎమ్మెల్యే శానంపూడి గెలుపునకు కృషి చేయాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు శివనాగ రాజు, వెంకటేశ్వర్లు, నాగుల్ మీరా, నరేశ్, నర్సింహ, జానీ, చారి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయం ఖాయం

- పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బాలవెంకట్‌రెడ్డి

మేళ్లచెర్వు, నవంబర్ 3 : వచ్చే అసెంబ్లీ ఎన్నికలో బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయం ఖాయమని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బోగాల బాలవెంకట్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. దీంతో పార్టీలోకి స్వచ్ఛందంగా చేరుతున్నారని తెలిపారు. ఆయన వెంట పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కూన్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

కోమటిరెడ్డి బ్రదర్స్ కాంగ్రెస్‌ను ముంచడం ఖాయం

- సీపీఎం మండల కార్యదర్శి అనంతప్రకాశ్

పాలకవీడు నవంబర్ 3 : కోమటిరెడ్డి బ్రదర్స్ కాంగ్రెస్ పార్టీని ముంచేస్తారని సీపీఎం మండల కార్యదర్శి అనంతప్రకాశ్ విమర్శించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి మీద కోపంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీతో సీపీఎం పొత్తును కోమటిరెడ్డి బ్రదర్స్ అడ్డుకొంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని నష్టపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. వామపక్షాల బలాన్ని తక్కువగా అంచనావేస్తూ పొత్తును అడ్డుకొంటున్నారన్నారు. వామపక్షాల మద్దతు లేకుండా వారు ఏవిధంగా గెలుస్తారో చూస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో వామపక్షాల బలం నిరూపించుకుంటామని, ఒంటరిగా ఎన్నికలు ఎదుర్కోవడానికి నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు

త్రిపురారం, నవంబర్ 3 : రాబోయే ఐదు రోజుల పాటు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించినందున రైతులు అప్రమత్తంగా ఉండాలని కంపాసాగర్ కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. వరి కోతలు వాయిదా వేసుకోవాలని, ఒకవేళ కోసినట్లయితే ధాన్యం తడువకుండా ఎత్తైనా ప్రదేశాల్లో నిల్వ ఉంచి పట్టాలు కప్పుకోవాలని పేర్కొన్నారు. వరి పొలంలో పురుగు మందులు పిచికారీ చేయవద్దని సూచించారు.

అకాల వర్షంతో నేలకొరిగిన వరి పైరు

నేల వాలిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

నేరేడుచర్ల, నవంబర్ 3 : మండలంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలవ్యాప్తంగా 21.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో మండలంలో 3,200ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. బోర్లు, బావులు, చెరువుల కింద ఆరుగాలం కష్టపడి సాగు చేసిన వరి పంట చేతికొచ్చే సమయంలో నష్టం వాటిల్లిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

గరిడేపల్లి : కీతవారిగూడెంలో విగ్రహాలకు జలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

కీతవారిగూడెంలో సీతారామచంద్ర ఆలయ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

గరిడేపల్లి, నవంబర్ 3 : మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో కీత కోటయ్య, కనకమ్మ దంపతులు, గ్రామస్తుల సహకారంతో నిర్మించిన సీతారామచంద్ర, లక్ష్మణ, ఆంజనేయ ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ, శిఖరముల ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం రెండోరోజు కొనసాగాయి. ఈ సందర్భంగా గ్రామంలో ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 8.25గంటలకు గణపతి పూజ, కర్మణః పుణ్యాహవచనం, నవ కలశస్నపనం, 9.30గంటలకు గ్రామస్తులంతా దేవతా విగ్రహాలకు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి జలాలతో అభిషేకాలు, 10.30 గంటలకు లక్షణోద్ధారణ, 11గంటలకు జలాధివాసం, ఊరి చివర విగ్రహాలకు 1008 బిందెలతో జలాభిషేకం, మధ్యాహ్నం 12గంటలకు గమిడి బంధనం, గ్రామానికి రాకపోకల నిలిపివేత, 12.30 గంటలకు ప్రభూత బలి, బలిచల్లే కార్యక్రమం, సాయంత్రం 5గంటలకు గణపతి నవగ్రహ, వాస్తు, సుదర్శన, రుద్ర, పంచసుక్త, మన్యుసూక్త హోమాలు, 6.30 గంటలకు ధ్యాన పుష్ప, ఫల, రస, శయ్యాదివాసములు, 7గంటలకు వేద స్వస్తి, నీరాజన మంత్ర పుష్పాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, అర్చకులు, మాలధారణ స్వాములు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED BDS DOCTORS
కోదాడ, హుజూర్‌నగర్, జగ్గయ్యపేటలోని ప్రఖ్యాత డెంటల్ హాస్పిటల్‌లో పనిచేయుటకు BDS డాక్టర్స్ కావలెను. ఆకర్షణీయమైన శాలరీ ఇవ్వబడును. వివరాలకు సంప్ర॥9966108455 & 9160782031.
NLG-

WANTED
★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

KIDNY STONES
★ మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్ లేని హోమియో పరిష్కారం. 47 సం॥, అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. Ph: 9866007924, 9550336677, 040-27000580.
NT-320707

BUSINESS OFFER
★ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న *బయోడిగ్రేడబుల్* కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9848211153, 9490786468.
NT-320324-All

PLOT FOR SALE
★ Iconic Infra: హైదరాబాద్ HMDA & DTCP అప్రూవ్డ్ లేఅవుట్ ప్లాట్లు @ శ్రీశైలం హైవే కొత్తూరు, సాగర్ హైవే బొంగులూరు, యాచారం & విజయవాడ హైవేలలో. 9154102338.
NT-320528

WANTED
★ రక్షణ సెక్యూరిటీ ఫోర్స్ నల్గొండలో షాపింగ్ మాల్స్ కొరకు పని చేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్ మరియు సెక్యూరిటీ సిబ్బంది మరియు వాలెట్ పార్కింగ్ డ్రైవర్ అర్జెంటుగా కావలెను. 12 గంటల Duty. సంప్ర: 8500199996, 9866949219
NT-320232

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ సల్లగూడెం.
సల్లగూడెం : 9182777626 | సల్లగూడెం : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | నాగార్జున : 9182777638

ప్రజలందరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- కోదాడ డీఎస్పీ ప్రకాశ్

మఠంపల్లి : రఘునాథపాలెంలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న కేంద్ర పోలీస్ బలగాలు

మఠంపల్లి, నవంబర్ 3: ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోదాడ డీఎస్పీ ప్రకాశ్ సూచించారు. రాష్ట్ర, కేంద్ర పోలీస్ బలగాలతో మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో శుక్రవారం ఆయన ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపడానికి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినటు తెలిపారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్ : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోదాడ డీఎస్పీ ప్రకాశ్ ప్రజలను కోరారు. సమస్యాత్మకమైన గ్రామమైన మండలంలోని లింగగిరిలో శుక్రవారం పోలీస్ ఫ్లాగ్ మార్చ్‌పాస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి, నియోజకవర్గంలోని మండలాల ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.